రైల్వే బ్రిడ్జి కింద పారుతున్న మురుగు నీరు

ఆయా గ్రామాల వాహన దారులకు ఇబ్బందులు

వికారాబాద్, మే 11 : రైల్వే బ్రిడ్జి కింద మురుగు నీరు చేరడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల వాహన దారులు ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆలంపల్లి నుంచి గెరిగెట్‌పల్లి వెళ్లే రోడ్డు సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద మురుగు నీరు ఏరులై పారుతుంది. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గెరిగెట్‌పల్లి, జాంబపూర్,కొట్టంగుట్ట, రాళ్లచిట్టంపల్లి, పీలారం, మైలార్‌దేవరంపల్లి తదితర గ్రామాలకు సైతం వాహన దారులు ఈ దారి వెంబడే ప్రయాణాలు సాగిస్తుంటారు. ఏ చిన్న పని ఉన్నా ప్రతి రోజు వికారాబాద్ పట్టణానికి ద్విచక్ర వాహనాలు, ఆటోలలో వస్తుంటారు. రైల్వే బ్రిడ్జికింద మురుగు నీరు చేరడంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో వాహన దారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు నెల రోజుల నుంచి ఈ సమస్య ఉన్నట్లు ప్రజలు తెలిపారు. ఈ మురుగు నీరు మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి, రామయ్యగూడ ఎంఐజీ కాలనీల నుంచి గెరిగెట్ పల్లి రైల్వే బ్రిడ్జి వరకు పారుతుందని పట్టణ ప్రజలు తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి రైల్వే బ్రిడ్జి కింద పారుతున్న మురుగు నీటిని తొలగించి... మరో సారి మురుగు నీరు చేరకుండా శాశ్వత పరిష్కారం చేయాలని పట్టణ ప్రజలు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

నర్సరీ మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం

నవాబుపేట, మే 11: మండల పరిధిలోని గుబ్బడీఫతేపూర్ గ్రామ నర్సరీలో మొక్కల పెంపకం నిర్లక్ష్యానికి గురవుతున్నది. పోయిన సంవత్సరం నాటిన మొక్కలు ఈ వచ్చే వర్షాకాలం నాటడానికి సిద్ధంగా ఉన్నాయి కానీ ఈ సంవత్సరం నాటాల్సిన మొక్కలు మాత్రం ఎప్పుడు విత్తనాలు మొలకెత్తుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్లాస్టిక్ సంచుల్లో మొక్కలను పెంచడానికి కావాల్సిన మట్టిని నింపి వాటిల్లో మొక్కలను పెట్టగా అవి ఇప్పటికీ మొలకెత్తలేదు. దీంతో నర్సరీ నిర్వాహకులు వీటిపై ఎంత శ్రద్ధ వహిస్తున్నారో అర్థమవుతున్నది. మరో వైపు గ్రామంలోని డ్రైనేజీ నీళ్లు మొత్తం ఇక్కడే వచ్చి చేరుతాయి ఎన్నో సార్లు సెక్రెటరీ, ఎంపీడీవో అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని సిబ్బంది తెలిపారు.

డ్రైనేజీ నీళ్లు వస్తున్నాయి..

నర్సరీలో పెంచుతున్న మొక్కల అడుగు బాగాన డ్రైనేజీ నీళ్లు బాగా వస్తున్నాయి. దీని ప్రభావం నర్సరీ మొక్కలపై ఉంది ఈ విషయాన్ని సెక్రెటరీ, ఎంపీడీవోలకు కూడా చాలా సార్లు చెప్పాం. వాళ్లు పరిష్కార మార్గాన్ని చూద్దాం అని చెబుతున్నారు కానీ పరిస్థితి మారలేదు. మాకు మొక్కలను పెంచి సంరక్షించే బాధ్యత ఉంటది కానీ డ్రైనేజీ నీళ్లు రానివ్వకుండా చేసే అధికారం లేదు .అందుకే పెట్టిన మొక్కలు పెరిగిన కాడికి పెరిగితే సీజన్ వచ్చాక వాటిని సెక్రెటరీ ఎక్కడ పెట్టమంటే అక్కడ పెడుతాం.

-అశోక్ ఫీల్డ్ అసిస్టెంట్

ఆదమరిస్తే.. అనంతలోకాలకు

• కోతకు గురైన రహదారులు • మరమ్మతులు చేయని అధికారులు

రాకొండ గేటు కోతకు గురైన రోడ్డు

దోమ, మే 11: రహదారుల అంచులు ధ్వంసమై ఆదమరిస్తే అనంతలోకాలకు దారితీసే ప్రమాదాలు పొంచి ఉన్నా ప్రభుత్వ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మండల పరిధిలోని పరిగి నుంచి గొడుగోనిపల్లి మీదుగా మహబుబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. అలాగే పరిగి నుంచి తిమ్మాయిపల్లి మీదుగా కోస్గి వెళ్లేరహదారిలో రాకొండ గేటు దగ్గర వర్షాకాలంలో రోడ్డు పక్కన గల మట్టి కోతకు గురై అత్యంత ప్రమాదకరంగా మారింది. రహదారుల అంచులు కోతకు గురై ప్రమాదపుటంచుల్లో వాహనదారులు నరక ప్రాయంగా ప్రయాణం కొనసాగిస్తున్నా రు.ప్రమాదాల నివారణకు రిపేర్లు కూడా చేయకపోవడంపై అటుగా వెలుతున్న ప్రయాణికులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేసి వాహనదారుల ప్రయాణం సులభతరం చేయాలి.

ప్రమాదం పొంచి ఉంది..

గత ఏడాది క్రితం భారీ వర్షానికి గొడుగోని పల్లి వాగు పొంగిపొర్లి రోడ్డుపై నుంచి ప్రవా హం వెళ్లడంతో ప్రధాన రహదారికి ఓ వైపు అంచు భాగం పూర్తిగా ధ్వంసమై అత్యంత ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వం గానీ ప్రత్యేక అధికారులైనా పట్టిం చుకోక పోవడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి

-నర్సింహులు, మాజీ సర్పంచ్ గొడుగోనిపల్లి ,దోమ మండలం

మరమ్మతులు చేపట్టాలి...

పరిగి నుంచి తిమ్మాయిపల్లి మీదుగా కోస్గి వెళ్లే ప్రధాన రహదారికి పక్కన రాకొండ గేటు దగ్గర వరద ప్రవాహానికి రోడ్డు పక్కన ఉన్న మట్టి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయాలలో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం . ఉంది కావున అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్నచోట మరమ్మతులు చేపట్టాలి

-బుగ్గరాములు, తిమ్మాయిపల్లి గ్రామం, దోమ

క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం

గుజరాత్ టైటాన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, మే 11: క్రీడలలో గెలుపోటములు సహజమని, క్రీడారంగం అభివృద్ధికి తమవంతు సహకారం అందజేస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పరిగి పట్టణంలో నెల రోజులుగా నిర్వహించిన పరిగి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ పరిగి ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందజేస్తామని చెప్పారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, రెండింటిని క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని వారు సూచించారు. క్రీడాకారులలో దాగి వున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు చక్కటి వేదికలుగా నిలుస్తాయన్నారు. నెల రోజులపాటు టోర్నమెంట్‌ను దిగ్విజయంగా నిర్వహించిన నిర్వాహకులను వారు అభినందించారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన గుజరాత్ టైటాన్ జట్టుకు రూ.లక్ష నగదు, ట్రోఫీ, రన్నరప్‌గా నిలిచిన కేకేఆర్ జట్టుకు రూ.50వేలు నగదు ట్రోఫీని మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

కులకచర్ల, మే 11: చౌడాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడాపూర్ గ్రామానికి చెందిన పుట్ట నాగమణికి రూ.120000ల చెక్కు, సంద్ర మోని నిఖితకు రూ.24000ల చెక్కు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు సలీమ్, రాము, యాదయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, రషీద్, కృష్ణయ్య, చిన్నయ్య, రమేశ్, శరత్‌కుమార్, నర్సింహులు, వినయ్, మణికంఠ, బాలు, వెంకటయ్య పాల్గొన్నారు

నేడు ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన

పరిగి, మే 11: పరిగి పట్టణంలో రూ. 27కోట్లతో చేపట్టనున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేస్తారని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఆసుపత్రి భవన నిర్మాణానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన చేయనుండగా, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొంటారన్నారు.కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

పూడూరు, మే 11: అనారోగ్యంతో నగరంలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతు మాజీ సర్పంచ్ పెంటమ్మ మృతి చెందింది పూడూరు మండలం నిజాంపేట్ మేడిపల్లి గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్‌లో ఒకసారి, జనరల్‌లో మరోసారి రెండు సార్లు (10 సంవత్సరాల పాటు) సర్పంచ్‌గా పని చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఉంటు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకు వచ్చి గ్రామంలో అండర్ గ్రౌడ్ డ్రైనేజ్ సిస్టమ్‌ను తీసుకు వచ్చి గ్రామంలో మురుగు లేకుండా శుభ్రంగా ఉంచేందుకు ఎంతో కృషి చేశారు. వారం రోజుల నుంచి అనారోగ్యంతో నగరంలో ఓ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగనున్నాయి.

భారత సైన్యం విజయం సాధించాలని పూజలు

వికారాబాద్, మే 11: భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో మన దేశం విజయం సాధించాలని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వరాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వేదహిత ఫౌండేషన్ డాక్టర్ మన్యుర్రీంద్రశర్మ ఆధ్వర్యంలో మోమిన్‌పేట మండలంలోని కేసారం ఆశ్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజ శేఖర్‌రెడ్డి పవిత్ర యాగం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు శివరాజ్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

వికారాబాద్, మే 11: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఆలంపల్లి శివారులో గల బావిలో మహిళ మృతదేహం నీటిపై తేలిందని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలాని వెళ్లి స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మహిళ ఎరుపు రంగు పూల చీర, చాక్లెట్ రంగు జాకెట్ ధరించి ఉంది. ఎరుపురంగు టవల్ పక్కన ఉన్నది. ఈ మేరకు వికారాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు వికారాబాద్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

ఆటో-బైక్ ఢీ..

ముగ్గురికి తీవ్ర గాయాలు

తాండూరు రూరల్, మే 11: తాండూరు మండలం, అల్లాపూర్ గ్రామ సమీపంలో బైక్ పై షేక్ నిజామోద్దీన్, ఖాజామియా తాండూరు వైపు వెళుతున్న క్రమంలో ఎదురుగా ఓ ఆటో సైడ్ నుంచి వచ్చి ఢీ కొట్టింది. దాంతో బైక్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు కాగా, ఆటోలో ఉన్న ఓ పాపకు స్వల్పగాయాలయ్యాయి. తీవ్రగాయాలైన వారిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతు న్నారు.

సీఎంఆర్ఎఫ్ కావాలంటే

కాంగ్రెస్ లీడర్లను కలవాలా?

బాధితుడు నీరటి వెంకటయ్య

బంట్వారం, మే 11: సీఎం రిలీఫ్ ఫండ్ కావాలంటే స్థానిక కాంగ్రెస్ నాయకులను కలవాలా... వారి వెంట తిరిగితేనే పనులు చేస్తారా....ఇలాగైతే 'ప్రజాపాలన' కు అర్థం ఏంటని మండల పరిధిలోని బస్వాపూర్ బాధితుడు నీరటి వెంకటయ్య ప్రశ్నించాడు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన భార్య నీరటి ప్రియాంక గత మార్చి నెలలో అనారోగ్యంతో తాం డూరు జేబీ ఆసుపత్రిలో చేరిందన్నారు. అయితే పరిస్థితి తీవ్రంగా ఉండడంతో శస్త్ర చికిత్స చేశారని చెప్పారు. దీంతో సుమారు రూ 96వేలు ఖర్చు అయింది. నిరుపేద కుటుంబం కావడం అంతగా ఖర్చు చేయలేక నానా యాతన పడ్డామన్నారు. అప్పులు చేసి, ఆసుపత్రి ఖర్చులు చెల్లించానన్నారు. అప్పులు తీర్చేందుకు కొంత ఆసరాగా సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక శాసన సభ్యుడు, స్పీకర్ ప్రసాద్ కుమార్ వద్దకు వెళ్లానని, ఆయన మండల నాయకులను సంప్రదించి దరఖాస్తును వారికి ఇవ్వాలని సూచించారన్నారు. దీంతో మండల నాయకులను సంప్రదించానని, అయితే దరఖాస్తు ఇస్తే తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే తమలాంటి నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అందని ద్రాక్షలా మారుతుందన్నారు. ఇప్పటికైనా స్పీకర్ స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో నెమలి మృతి

కులకచర్ల, మే 11: కుక్కల దాడిలో జాతీయ పక్షి నెమలి మృతి చెందిన ఘటన ఆదివారం మండల పరిధిలోని రాంనగర్ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామంలో సంచరిస్తున్న నెమలి పై కుక్కలు దాడిచేయగా నెమలి అక్కడి కక్కడే మృతి చెందిందని స్థానికులు తెలిపారు.

మురుగు నీటికి దారేదీ !

దోమ, మే 11: మండల పరిధిలోని బాసుపల్లి గ్రామ పరిగి మహబుబ్‌నగర్ ప్రధాన రహదారి పక్కనే మురుగు నీరు నిలిచిపోయింది. సైడ్‌డ్రెయిన్ లేకపోవడంతో మురుగు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీటి నిల్వతో కాలనీలో దోమల బెడద ఎక్కువై అనారోగ్యం బారిన పడుతున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటికి దారి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉండేందుకు ఫ్లాట్ ఇస్తే కబ్జా..

బంజారాహిల్స్,మే 11: కొన్నాళ్లపాటు ఉంటానంటే ఫ్లాట్‌ను ఇస్తే దాన్ని కబ్జాచేసేందుకు యత్నించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబాయిలో వైద్యురాలిగా పనిచేస్తున్న డా. సౌమ్యా మజహర్‌కు బంజారాహిల్స్ రోడ్ నం.9లో మహమూద్ హబీబ్ అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్ ఉంది. గత కొన్నేళ్లుగా తన సోదరి లుబ్నా మజహర్, ఆమె కొడుకు(15) ఉండేందుకు ఫ్లాట్ ఇచ్చింది. కాగా.. ఇటీవల లుబ్నా మృతి చెందడంతో ఆమె కొడుకు అమ్మమ్మవద్ద ఉంటున్నాడు. అప్పటినుంచి ఈ ఫ్లాట్ రక్షణ బాధ్యతలను డా.సౌమ్యా మజహర్ తన సోదరుడు మహ్మద్ యాసిన్ షరీఫ్‌కు అప్పగించడంతో పాటు జీపీఏ చేసింది. కాగా.. లుబ్నా మజహర్ భర్త షకీబ్ మహమూద్ గత ఏడాది జూలైలో దౌర్జన్యంగా ఫ్లాట్ వద్దకు వచ్చి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. అప్పటినుంచి ఫ్లాట్ లో ఉంటూ ఎవరినీ రానివ్వడం లేదు. ఈ మేరకు సమాచారం అందుకున్న మహ్మద్ యాసిన్ షరీఫ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం..

కాచిగూడ, మే 11: భర్తతో గొడవ పడి భార్య అదృశ్యమైంది. కాచిగూడ పోలీసుల వివరాల ప్రకారం.. కాచిగూడ హర్రస్ పెంటకు చెందిన రాఘవేంద్ర భార్య బాలా త్రిపుర సుందరి(24)భర్తతో గొడవపడి ఈనెల 9న ఇంట్లోనుంచి వెళ్లిపోయింది. రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ నోటీసుతో మాకు సంబంధం లేదు..

ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యలు దురదృష్టకరం

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): బాచుపల్లి ఎమ్మార్వో ఇచ్చిన నోటీసులతో తమకు సంబంధం లేదని, ప్రతీ కూల్చివేతను, నోటీసును హైడ్రాకు ఆపాదించడం సరికాదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని, ఒకవైపు కలెక్టర్‌కు తెలియకుండానే ఎమ్మార్వో నోటీసులిచ్చారని ఈటల చెబుతూనే మరోవైపు హైడ్రాను దోషిగా చూపించడం సరికాదని రంగనాథ్ అన్నారు. బాచుపల్లిలో రెండు అపార్టుమెంట్లకు ఎమ్మార్వో నోటీసులిచ్చిన వైనంపై ఈటల చేసిన కామెంట్లను రంగనాథ్ ఒక ప్రకటనలో ఖండించారు. అసలు నోటీసుల విషయం గురించి తనకు కానీ, హైడ్రా అధికారులకు కానీ తెలియదన్నారు. ఇదే విషయాన్ని మేడ్చల్– మల్కాజిగిరి కలెక్టర్‌తో మాట్లా డి ఆ నోటీసులు ఎందుకు ఇచ్చారో ఎమ్మార్వోను అడగాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈటల మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించేవిగా, అయోమయానికి గురిచేసేవిగా ఉన్నాయన్నారు. హైడ్రాపై ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉన్న సమయంలో ఈటల హైడ్రాపై ఆరోపణలు చేస్తూ ప్రతీ నోటీస్‌ను, ప్రతీ కూల్చివేతను హైడ్రాకు ఆపాదించడం సబబు కాదన్నారు. సచివాలయంలో ఈటల కలిసినప్పుడు హైడ్రా కార్యకలాపాలపై చర్చ వస్తే జూలై 2024 కంటే ముందు కట్టిన నివాసాల జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశానని రంగనాథ్ తెలిపారు. హైడ్రాపై అనవసరమైన ఆరోపణలు చేసి అయోమయానికి గురిచేయొద్దని ఈటలను రంగనాథ్ కోరారు.

మద్యం తాగి 272 మంది పట్టుబడ్డారు..

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 238మంది వాహనదారులను సైబరాబాద్ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. పట్టుబడిన 272మంది వాహనదారుల్లో 189మంది ద్విచక్రవాహనదారులే ఉండటం గమనార్హం. కాగా 12మంది త్రి చక్రవాహనదారులు, 66మంది నాలుగు చక్రాల వాహనదారులు, ఐదుమంది భారీ వాహనదారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా బ్రీత్ ఎనలైజర్ పరీక్షల్లో బీఏసీ రేంజింగ్ 35ఎంజీ/100ఎంఎల్ నుంచి 200ఎంజీ/100ఎంఎల్ మధ్యన 245మందికి, 200ఎంజి/100ఎంఎల్ నుంచి 300ఎంజీ/100ఎంఎల్ మధ్య 18 మందికి, 301ఎంజీ/100ఎంఎల్ నుంచి 500ఎంజీ/100ఎంఎల్ మధ్య 9మందికి బీఏసీ రేంజ్ ఉన్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 51 మందికి జైలు

సిటీబ్యూరో, మే 11(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో వారంరోజుల వ్యవధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 51 మంది జైలుకు వెళ్లినట్లు ట్రాఫిక్ ఉన్నతాధికారులు తెలిపారు. ఈనెల 3 నుంచి 9 వరకు 1039 కేసులు నమోదయ్యాయని, ఇందులో 762 మంది 40 సంవత్సరాలలోపు ఉన్నారని, మొత్తం కేసుల్లో 890 టూవీలర్ నడుపుతున్నవారే ఉన్నారని పేర్కొన్నారు. ఈ వారం రోజుల్లో ముగ్గురు మహిళలు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, బీఏసీ కౌంట్ 200కు పైగా వచ్చిన వారు 54 మంది ఉన్నారని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

చిక్కని దొంగ..?

దేశ సరిహద్దులు దాటే శాడా..?

ఠాణా నుంచి రెండు సార్లు పరార్

నేపాల్‌లో నక్కి ఉంటాడని

అనుమానిస్తున్న పోలీసులు

వెంగళరావునగర్, మే 11 : ఆ నేపాల్ దొంగ పోలీసులకు చిక్కినా మస్కా కొట్టి మాయం అవుతాడు.. పోలీసుల కస్టడీ నుంచి కళ్లుగప్పి తప్పించుకుంటాడు.. అలా రెండు సార్లు చిక్కినట్టే చిక్కి పరారయ్యాడు.. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పోలీసులు అతని జాడను గుర్తించలేకపోయారు. నిందితుడు దేశ సరిహద్దులు దాటేసి ఉంటాడని భావిస్తున్నారు. మధురానగర్ పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులకు మస్కా కొట్టి ఆ దొంగ రెండుసార్లు పారిపోయాడు. ఇది పోలీసుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. గతేడాది ఆగస్టులో యాదగిరినగర్ బస్తీలోని ఇళ్లలోని నల్లా ట్యాపులు చోరీచేసే దొంగపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదే పదే ఇండ్లలో నల్లాలు చోరీకి గురవుతుండడంతో బస్తీవాసులే దొంగను ఎలాగైనా పట్టాలని దృఢ సంకల్పంతో ఇళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. దొంగ ఓ ఇంట్లోకి జొరబడి వాటర్ ట్యాపులు కాజేసి ఉడాయించడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. దొంగ చోరీ చేసే వీడియోను బస్తీవాసుల వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. బస్తీ వాసులంతా చైతన్యవంతులై అప్రమత్తంగా ఉండి గతేడాది ఆగస్టు ఒకటో తేదీన నేపాల్‌కు చెందిన దొంగ వికాస్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి మధురానగర్ పోలీసులకు అప్పగించారు. పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల కళ్లు గప్పి నిందితుడు వికాస్ పరారయ్యాడు. అయితే కొద్ది రోజులకే ఓ కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అతన్ని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. ఠాణానుంచి ఆ దొంగ మరోసారి పారిపోయాడు. ఇప్పటికే అతనిపై మధురానగర్ ఠాణాలో పలు కేసులు నమోదయ్యాయి. 9 నెలలు గడిచినా ఆ నిందితుడ్ని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. చోరీ కేసు నిందితుడు వికాస్ ఎప్పుడో దేశ సరిహద్దులు దాటి తన దేశమైన నేపాల్‌కు వెళ్లి అక్కడే నక్కి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నిందితుడ్ని పట్టుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిందితుడు వికాస్(ప్రాత చిత్రం)

నగరంలో ఆబ్కారీ దాడులు

హషీష్ ఆయిల్, గంజాయి పట్టివేత

సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): హషీష్ ఆయిల్ విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారంలోని మహాదేవపురం కాలనీకి చెందిన సుభాశ్, మేడ్చల్ –మల్కాజిగిరికి చెందిన రామచంద్రరాజులు కుత్బుల్లాపూర్, అయోధ్యనగర్‌లో హషీష్ ఆయిల్ అమ్మకాలు జరుపుతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు హషీష్ ఆయిల్ విక్రయిస్తున్న వారిద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.3లక్షల విలువ చేసే 300గ్రాముల హషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న రాజుతో పాటు కనకతాళ సుభాశ్, నవీన్‌రాజులపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి తెలిపారు. కాగా మరో కేసులో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ధూల్‌పేటకు చెందిన అర్జున్‌సింగ్‌ను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 1.212కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.